# 9

# దేవుని జ్ఞానము వెల్లడిచేయబడింది

## (3:8-13)

3:1-7లో, ఆయన అన్యజనుల మధ్య చేసిన తన వ్యక్తిగత పరిచర్య గూర్చి పౌలు మనకు తెలియజెప్పాడు. ఇదే ఆలోచనను ఇప్పుడు కూడ 3:8-13లో కొనసాగిస్తూ, దేవుని జ్ఞానము ఎలా వెల్లడిచేయబడిందో చెప్పుచున్నాడు.

### అన్యజనులకు ప్రబోధించుటకు ప్రసాదింపబడిన కృప (3:8-11)

**8-11... శోధింపశక్యము కాని క్రీస్తు ఐశ్వర్యమును అన్యజనులలో ప్రకటించుటకును ... పరిశుద్ధులందరిలో అత్యల్పుడనైన నాకు, ఈ కృప అనుగ్రహించెను.**

**వచనములు 8-11. పరిశుద్ధులందరిలో అత్యల్పుడను** అంటూ పౌలు తనను గూర్చి మాటలాడినప్పుడు ఆయన ఒక అబద్ధ అణకువను తెలియజెప్పుచుండలేదు. ఇది తనను గూర్చి తనకుండిన తథ్యమైన అనుభూతియై యుండింది. 1 తిమోతి 1:12-17లో, పాపులలో ప్రధానుడై యుండినవాడు, అతని యెడల ప్రదర్శింపబడిన కనికరము, కృప, మరియు ప్రేమనుబట్టి రక్షింపబడిన మరియు క్షమింపబడిన పౌలు దేవుని కీర్తించుచు యేసు క్రీస్తుకు వందనములు చెల్లించాడు. ఆయన దేవదూషకుడును, హింసకుడును, మరియు అత్యంత హానికరుడునై యుండెను. అజ్ఞానముతో కూడిన అవిశ్వాసము వలన, ఆయన క్రీస్తును మరియు సంఘాన్ని వ్యతిరేకించాడు. అతని ఆత్మను రక్షించుటకు దేవుడు తన పరిపూర్ణమైన సహనాన్ని ఆయన యెడల ప్రదర్శించాడనియు, అతనినొక మాదిరిగా పైకెత్తాడనియు ఆయన నమ్మాడు: పాపులలో ప్రధానుడైన అతడే రక్షింపబడినట్లయితే, ఇతరులెవరైనా కూడ రక్షింపబడగలరు! "పరిశుద్ధులందరిలో అత్యల్పుడనియు" "అపొస్తలందరిలో అల్పుడనియు" ఈ అపొస్తలుడు తననుతాను పరిగణించుకొన్నాడు (1 కొరింథీయులకు 15:9). ఇంకా, అతడు "ఏమాత్రపువాడును కాడని" తననుతాను ఎంచుకొన్నాడు (2 కొరింథీయులకు 12:11). అతడు "పరిగణింపబడినవాడు" అయ్యాడు గనుక దేవుని కృప చొప్పున అపొస్తలత్వము మరియు పరిచర్య అనుగ్రహింపబడినవి (3:2, 7 చూడుము).

పౌలు "అన్యజనులకు అపొస్తలుడు" అయ్యింది, దేవుని కృపనుబట్టియే (రోమీయులకు 11:13), గనుక **శోధింపశక్యము కాని క్రీస్తు ఐశ్వర్యమును** వారికి ప్రకటించాడు. ఈ "ఐశ్వర్యము" (*ploutos*)లో అతని పాపములను క్షమించిన దేవుని కృప (1:7), పరిశుద్ధులలో ఆయన స్వాస్థ్యము యొక్క మహిమైశ్వర్యము" (1:17-19), "రాబోవు యుగమలలో" కనుపరచబడునై యుండిన కృప (2:7), దేవుని మహిమ (3:15-18), మరియు, ఈ వచనములో ఉన్నట్టుగా, క్రీస్తు కూడ ఉన్నాడు. "సువార్త ఐశ్వర్యమంతా,

కనుగొనబడదగు శోధింపశక్యముకాని రక్షణ సంపద అంతా, క్రీస్తే అయియున్నాడని" ఇచ్చట రిఫరెన్సును చక్కగా అర్థం చేసుకొనవచ్చును.[1] "శోధింపశక్యముకాని" అను పదమునకు *anexichniastos* ("అడుగుజాడలు తెలియశక్యముకాని") సమానార్థ గ్రీకు పదమై యున్నది.[2] క్రీస్తు ఎవరై యున్నారు మరియు ఆయన తెచ్చిన రక్షణ వాస్తవము ఎంతటి సంపన్నమైన సంపూర్ణతతో కూడిన సత్యములై యున్నవో ప్రజలు అర్థంచేసుకొనలేరు. మానవులకు దాని "అడుగుజాడల అంతు దొరకదు" లేక వారికి దాని గూర్చిన సంపూర్ణ అవగాహన అందదు: యేసు క్రీస్తు నందలి దేవుని ప్రణాళిక, దాని లోతు యొక్క జాడల అంతు దొరకని లోతైన జలాశయము వంటి నిధియై యున్నది. "ఆహా, దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము! ఆయన తీర్పులు శోధింప నెంతో అశక్యములు; ఆయన మార్గములెంతో అగమ్యములు!" అని పౌలు రోమీయులకు 11:33లో ఘోషిస్తున్నాడు.

## దేవుని మర్మమును వెలుగులోనికి తెచ్చుటకైన కృప (3:8–11)

**8–11... సమస్తమును సృష్టించిన దేవునియందు పూర్వకాలము నుండి మరుగైయున్న ఆ మర్మమును గూర్చిన యేర్పాటు ఎట్టిదో అందరికిని తేటపరచుటకు ...**

**వచనములు 8–11.** పౌలు చెప్పుచున్న దాని ప్రకారము, దాచబడి యుండిన మర్మసహితమైన ప్రణాళికను వివరించుట, దేవుని కృప చొప్పున అతనికి ప్రసాదింపబడిన ప్రత్యేకార్హత మరియు కార్యభారము లోని ఒక భాగమై యుండింది. **తేటపరచుటకు** అను మాట *phōtizō* యొక్క అక్షరార్థ అనువాదమై యున్నది. అనగా, దేవుడు "తన రహస్య సంకల్పమును నెరవేర్చుకొను విధానమును ఎలా ఏర్పరచుకొన్నాడో" విశదముగా వివరిస్తూ, మానవులు వారి మనో నేత్రములు తెరచి దానిని చూడగలుగునట్లు వారికి సహాయము చేస్తూ యేసు క్రీస్తు వ్యక్తిత్వమును మరియు కార్యమును ప్రబోధించుటకు దేవుని కృప పౌలును సమర్థవంతుని జేసినదనునది దీని స్పష్టమైన అర్థమై యున్నది.[3] 1:17–19లో, ఎఫెసీయులకు తేటతెల్లముగా తెలియజేయబడవలెనని వారి కొరకు పౌలు ప్రార్థించాడు. ఇక్కడ, దేవుడు తన ప్రార్థనలకు తన పరిచర్య ద్వారా, అనగా ప్రజలు దేవుని సత్యమును తెలిసికొనవలెనను ఇదే ఉద్దేశము నిమిత్తము రూపొందింపబడిన దాని ద్వారా, ప్రత్యుత్తర మొసగునని చూపిస్తున్నాడు.

**యేర్పాటు** అను మాట దేవుడు తన ప్రణాళికను తేటపరచుటకు ప్రయోగింపబడిన పద్ధతిని సూచిస్తుంది (1:8–10 చూడుము). పూర్వకాలము నుండి, దేవుడు దానిని (ఒక ప్రత్యక్షతగా) బయలుపరచనంత వరకు ఈ ప్రణాళిక (ఒక **మర్మముగా**) మరుగుచేయబడి యుండింది. **సమస్తమును సృష్టించిన దేవుడు** అను సూచన, దేవుడు అనగా, ఈ విశాల విశ్వమంతటికి సృష్టికర్తయైనవాడు, మానవాళి నిమిత్తము ఒక ప్రణాళికను మరియు ఒక సంకల్పమును సహితము రచించాడని పాఠక మహాశయులకు గుర్తుచేసింది. ఈ ప్రణాళిక ఆయన మనస్సులో అనాది నుండే ఉండింది (3:6; కొలొస్సయులకు 1:25–27 చూడుము).

## దేవుని జ్ఞానము తెలియబడజేయుటలో గల ఉద్దేశము (3:8–11)

**[8–11]... పరలోకములో ప్రధానులకును అధికారులకును, సంఘము ద్వారా తన యొక్క నానావిధమైన జ్ఞానము ఇప్పుడు తెలియబడవలెనని ఉద్దేశించి ...**

**వచనములు 8–11.** దేవుని సంకల్పమును అన్యజనలకును ప్రకటించాల్సిన బాధ్యత పౌలుకు అప్పగింపబడింది. ఏది ఏమైనా, *దేవుని సంకల్పమును సకల జనులకు తెలియజేయుట సంఘమంతటి బృహత్కార్యభారమై యున్నదని* పౌలు ఈ వాక్యభాగములో ఘోషిస్తున్నాడు. **దేవుని నానావిధమైన జ్ఞానము ఇప్పుడు తెలియజేయబడునట్లు** "అన్యజనులకు ప్రకటించుటకు" (3:8–11) మరియు దేవుని మర్మమును "తేటపరచుట" (3:8–11) పౌలు ధ్యేయమై యుండింది. "నానావిధమైన" అను మాట *polupoikilos* అను గ్రీకు విశేషణము యొక్క అనువాదమై యున్నది, ఇది క్రొత్త నిబంధనలోని ఈ వచనములో మాత్రమే కనబడుచున్నది మరియు బట్టలు, పూవ్వులు, లేక చిత్రలేఖనములలోని వైవిధ్యమైన రంగులను సూచించుచున్నది.[4] "దేవుని జ్ఞానము" – పౌలు చర్చించుచుండిన దేవుని ప్రణాళిక – అది సంపూర్ణంగా బయలుపరచువరకు దేవుడు తన మర్మమును క్రమేపి బయలుపరచుచుండిన కొలది గొప్ప వైవిధ్యమైన విధానములలో నివేదింపబడింది. వారు భవిష్యత్తు గూర్చి ప్రవచించుచుండిన సందర్భాల్లో పాత నిబంధన ప్రవక్తలు ఈ విషయాలను పరోక్షంగా ప్రస్తావించారు, గనుక వాటిని చూడవలెనని దేవదూతలు ఆశించారు; కానీ దేవుడే దానిని సంపూర్ణంగా తేటపరచనంత వరకు దేవదూతలుగాని మానవులుగాని ఆయన ప్రణాళికను గ్రహించలేకపోయారు (1 పేతురు 1:10–12 చూడుము). దేవుని జ్ఞానము, ఇప్పుడు తేటపరచబడినది, భిన్నత్వంలో సంపన్నమైనదియు రూపకల్పనలో మహిమాన్వితమైనదియునై యున్నదని పౌలు నొక్కివక్కాణించాడు.

"ఇప్పుడు," ప్రస్తుత కాలమందు (క్రైస్తవ యుగము), దేవుని ప్రణాళికను **సంఘము** ప్రచురింపవలెను. ఈ పత్రిక అంతయు సంఘమును గూర్చినదే అయినప్పటికిని, ఈ పత్రికలో "సంఘము" (*ekklēsia*) అను మాట ఉపయోగింపబడుట ఇది రెండవసారి మాత్రమే (1:22, 23పై గల వ్యాఖ్యానము చూడుము). సంఘము దేవుని జ్ఞానమును, లేక ప్రణాళికను, **పరలోకములో ప్రధానులకును అధికారులకును** తెలియజెప్పవలసి యున్నది. "పరలోకములోని ఈ ప్రధానులు మరియు అధికారులు" ఎవరో లేక సంఘము దేవుని జ్ఞానమును వీరికి ఎలా తెలియజేయాలో, పౌలు మనకు ఎవ్విధమైన వివరములను ఇచ్చుటలేదు. (ఈ పుస్తకములో తరువాత అగుపించు "అదనపు అధ్యయనము కొరకు: 'ప్రధానులు మరియు అధికారులు' [3:8–11]" చూడుము.)

## దేవుని నిత్య సంకల్పము నెరవేరుట (3:8–12)

**[8]దేవుడు మన ప్రభువైన క్రీస్తు యేసునందు చేసిన నిత్య సంకల్పము చొప్పున, ...**
**[12]ఆయనయందలి విశ్వాసము చేత ధైర్యమును నిర్భయమైన ప్రవేశమును ఆయననుబట్టి మనకు కలిగియున్నవి.**

**వచనములు 8-11. నిత్య సంకల్పము,** *prothesin tōn aiōnōn* అను గ్రీకు వ్యక్తీకరణమునకు అనువాదమై యుండి, "యుగయుగాల ఉద్దేశము" అనునది దీని అక్షరార్థమై యున్నది. ఏది ఏమైనా, దేవుని ఉద్దేశము కేవలము యుగయుగాలుగా కొనసాగుచుండునదేదో ఒకటి కాదు: అది ఆయన మనస్సులో అనాది కాలము నుంచే ఉన్నది. "నిత్య" అనునదొక మంచి అనువాదమై యున్నది. క్రీస్తునందున్నవారు "జగత్తు పునాది వేయబడక మునుపే," లేక "పూర్వకాలము నుండి" (1:4-6) ఏర్పరచుకొనబడినవారని వారి గూర్చి ఆయన మాటలాడినప్పుడు పౌలు ఇదే అభిప్రాయమును నివేదించాడు. "దేవునియందు పూర్వకాలము నుండి మరుగై యున్న ఆ మర్మము" (3:8-11) అని ఆయన తెలియజెప్పుచుండిన సందర్భములో దేవుని నిత్య సంకల్పము యొక్క స్వభావము గూర్చి కూడ పౌలు పరోక్షంగా ప్రస్తావించాడు. ఇతర పత్రికలలో "అనాదినుండి" (రోమీయులకు 16:25-27), "అనాదికాలముననే" (2 తిమోతి 1:9, 10), "అనాదికాలమందే" (తీతు 1:1-4) అని ఆయన మాటలాడుచుండినప్పుడు పౌలు నిత్యత్వమును సూచించాడు.

**చేసిన** అను మాట ఏదో సాధింపబడినదను అర్థము నిచ్చుచున్నది, గనుక దేవుని నిత్య సంకల్పము **మన ప్రభువైన క్రీస్తు యేసునందు** నెరవేరినదని పౌలు సెలవిచ్చుచున్నాడు. ఏది ఏమైనా, దేవుడు క్రీస్తు యేసునందు "చేసినది" సంఘము చేత ఇతరులకు తెలియజెప్పబడవలెను. సంఘము చేత చేయబడవలసిన ఒక నిత్య సంకల్పమును దేవుడు క్రీసు యేసునందు కలిగియుండినట్లయితే, సంఘము దేవుని నిత్య సంకల్పములో ఉన్నదని తేటతెల్లమగుచున్నది. సంఘమనునది అంతా జరిగిపోయిన తరువాత దేవునికి తట్టిన ఆలోచన లేక ఆయనకు ప్రమాదవశాత్తు వచ్చిన విషయం కాదు. యేసు క్రీస్తు తన రాజ్యమును స్థాపించుటకు ఈ లోకమునకు వచ్చాడు, కానీ తన రాజ్యామును "వాయిదా వేసాడు" మరియు యూదులు ఆయనను తృణీకరించారు గనుక దానికి బదులుగా ఆయన సంఘమును స్థాపించాడని కొందరు మతోపదేశకులు మనకు చెప్పుదురు. ఈ దృష్టికోణం ప్రకారం, యేసు "ఆయన ఇహలోకమునకు వచ్చిన బృహత్కార్యములో విఫలుడై, ఆయన మొదటిసారి వచ్చినప్పుడు విఫలుడైన ఆ పని చేయుటకు రెండవసారి తిరిగి వచ్చునట్లు పరలోకమునకు తిరిగి వెళ్లాడని అర్థమగుచున్నది."[5] అలాగైతే, మొదటిసారి వచ్చినప్పుడు చేయుటకు విఫలుడయ్యాడు కాబట్టి రెండవసారి వచ్చినప్పుడు సఫలుడౌతాడను హామీ ఏమున్నది? లేదు, సంఘము ఏదో మరొక దాని కొరకైన ప్రత్యామ్నాయమై యుండలేదు; సంఘము దేవుని నిత్య సంకల్పము ప్రకారమైనదని పౌలు రూఢిపర్చాడు.

"రాజ్యము," "క్రీస్తు యేసు మూర్తిమంతములోని దేవుని పరిపాలనా పరిధియై" యున్నదనియు, "సంఘము," "యేసు క్రీస్తు చేత లోకములో నుండి ఆయన యొద్దకు ప్రత్యేకముగా పిలువబడినవారు" అయి యున్నారనియు బైబిలు విద్యార్థులు తెలిసికొని యుండవలెను.[6] దేవుని రాజ్యము మరియు క్రీస్తు యేసు సంఘము ఒకే సభ్యులు గలదై యున్నవి; ఈ అవగాహన చొప్పున, "రాజ్యము" మరియు "సంఘము" సమానార్థకములై యున్నవి.

**వచనము 12.** "దేవుడు మన ప్రభువైన క్రీస్తు యేసునందు చేసిన" తన నిత్య సంకల్పమును పౌలు పేర్కొన్నప్పుడు, క్రీస్తునందున్న యూదులకును అన్యజనులకును చెందియున్న ప్రత్యేకార్హతల గూర్చి పౌలు వెంటనే ఆలోచించాడు. **ఆయనయందలి విశ్వాసము**

**చేత ధైర్యమును నిర్భయమైన ప్రవేశమును** క్రీస్తునందలి మన ప్రత్యేకార్హతల జాబితాలో ఉన్నవి. "ధైర్యము" మరియు "ప్రవేశము" అని అర్థమిచ్చు గ్రీకు పదములు ఒక ఉపపదము చేత నియంత్రింపబడుచున్నవి గనుక నిర్భయమైన ప్రవేశమును గూర్చిన అభిప్రాయమును నొక్కివక్కాణింపవచ్చునని ఆండ్రూ టి. లింకన్ గమనించాడు.[7] "ధైర్యము" (అక్షరార్థముగా, "ఆత్మవిశ్వాసములో") ఈ అభిప్రాయమునకు సాయపడవచ్చు, "నిర్భయమైన ప్రవేశమును కలుగుచున్నదని" ఈ గ్రంథపాఠము చదువబడునట్లు చేయుచున్నదని ఈయనగారు ధృవపర్చారు.[8]

*Parrēsia* అను పదము, 6:19లో మరియు మరొక రూపంలో 6:10లో కనబడుతుంది, అది "ధైర్యము" అని అనువాదింపబడిన గ్రీకు నామవాచక పదమై యున్నది. "నోరు తెరచి, యథార్థమైన నిర్భయముతో మాటలాడుటకు గల స్వేచ్ఛ లేక నిర్మొహమాటము" అని దాని అర్థమై యున్నది.[9] "ఆయన [క్రీస్తు] యందలి విశ్వాసమునుబట్టి" క్రైస్తవులు ఈ "ధైర్యము" కలిగియుందురు. మనము క్రీస్తు యేసునందున్నాము గనుక, మనము మన దేవుని సమీపించునప్పుడు భయపడాల్సిన పని లేదు లేదా సిగ్గుపడాల్సిన అవసరం లేదని మనకు అభయమియ్యబడుచున్నది. క్రీస్తు యేసునుబట్టి దేవుడు తన కృపామహదైశ్వర్యమును మన యెడల ప్రదర్శించుచున్నాడు.

"ధైర్యము" అని అనువదింపబడిన గ్రీకు మాట pepoithēsis. పౌలు చేత మాత్రమే క్రొత్త నిబంధనలో ప్రయోగింపబడిన పదమై, మనకు ఈ వాక్యభాగములోనేగాక, యింకా ఐదు సార్లు అగుపించును (2 కొరింథీయులకు 1:15, 16; 3:4; 8:22; 10:2; ఫిలిప్పీయులకు 3:4). ఇటువంటి ధైర్యము హెబ్రీయులకు 4:15, 16 మరియు 10:19–22లోను వ్యక్తము చేయబడి యున్నది. మొదటి వాక్యభాగములో, యేసు క్రీస్తు మన ప్రధాన యాజకుడై యుండి, మన వలెనే ఆయన కూడ శోధింపబడినాడు గనుక మన యెడల సహానుభూతి చూపుచున్నాడని హెబ్రీపత్రిక రచయిత చెప్పుచున్నాడు. ఆ తరువాత, "గనుక మనము కనికరింపబడి, సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము" అని చెప్పుచున్నాడు. రెండవ వాక్యభాగములో, "ఆయన రక్తము వలన పరిశుద్ధ స్థలమునందు ప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగియున్నది గనుకను, దేవుని ఇంటిపైన మనకు గొప్ప యాకజకుడున్నాడు గనుకను, మనస్సాక్షికి కల్మషము తోచకుండునట్లు ప్రోక్షింపబడిన హృదయములు గలవారమును, నిర్మలమైన ఉదకముతో స్నానము చేసిన శరీరములు గలవారమునై యుండి, విశ్వాస విషయములో సంపూర్ణ నిశ్చయత కలిగి, యథార్థమైన హృదయముతో మనము దేవుని సన్నిధానమునకు చేరుదమని" రచయిత ఉద్ఘాటించుచున్నాడు.

### అధైర్యపడకుండుటకు ఇవ్వబడుచున్న ప్రోత్సాహము (3:13)

**13కాబట్టి మీ నిమిత్తమై నాకు వచ్చిన శ్రమలను చూచి మీరు అధైర్యపడవద్దని వేడుకొనుచున్నాను, ఇవి మీకు మహిమకరములై యున్నవి.**

**వచనము 13.** తరువాతి వాంగ్మూలము, 3:1–12లో తెలియజెప్పబడిన దేవుని మర్మములో గల తన స్థానమును గూర్చి పౌలు చర్చించుచుండిన విషయాన్ని

ముగించుచున్నది. పౌలు తన పరిచర్యను నెరవేర్చునట్లు ఆయన సహించిన శ్రమలనుబట్టి, ఈ ఉత్తరమును వ్రాయుచుండిన సమయంలో ఆయన చెరసాలలో అనభవించుచుండిన శ్రమతో సహా, మందలింపు ఆవశ్యకమై యుండింది. పౌలు యొక్క బృహత్కార్యము, అనగా అన్యజనులకు సువార్తను అందించాలని అప్పగింపబడిన బాధ్యాత, ఈ కష్టములను కొనితెచ్చింది (2 కొరింథీయులకు 11:23–28 చూడుము). ఆయన ఎదుర్కొనిన **శ్రమలనుబట్టి** లేదా అపాయములనుబట్టి లేదా ఆయన భరించిన బాధలనుబట్టి ఎఫెసీయులు నిరుత్సాహపడవలెననిగాని, మానసికంగా అలసిపోవలెననిగాని, లేక **ధైర్యమును కోల్పోవలెననిగాని** ఆయన ఆశించలేదు. కాబట్టి, ఆయన అనుభవించిన శ్రమలు (వారి) **మహిమ నిమిత్తమైనవేనని** పౌలు తన పాఠకులకు గుర్తుచేసాడు. "మేము శ్రమ పొందినను, మీ ఆదరణ కొరకును రక్షణ కొరకును పొందుదుము ..." (2 కొరింథీయులకు 1:6); "కావున మాలో మరణమును మీలో జీవమును కార్యసాధకమగుచున్నవి" (2 కొరింథీయులకు 4:12); "అందుచేత ఏర్పరచబడినవారు నిత్యమైన మహిమతోకూడ క్రీస్తు యేసునందలి రక్షణ పొందవలెనని నేను వారి కొరకు సమస్తమును ఓర్చుకొనుచున్నాను" (2 తిమోతి 2:10).

### అదనపు అధ్యయనము కొరకు:

### ప్రధానులు మరియు అధికారులు (3:8–11)

"ప్రధానులు" [*archē*] మరియు "అధికారులు" [*exousia*] అను పదములను పౌలు తన రచనలలో ఎలా ప్రయోగిస్తున్నాడు? యేసు క్రీస్తు, "సమస్తమైన ఆధిపత్యము [*archēs*] కంటెను అధికారము [*exousias*] కంటెను శక్తి కంటెను ప్రభుత్వము కంటెను ఎంతో హెచ్చుగా" దేవుని కుడి పార్శ్వమునకు హెచ్చింపబడినాడని (ఎఫెసీయులకు 1:20–21), మరియు క్రైస్తవుల పోరాటము "ప్రధానులకు" (*archas*) మరియు "అధికారులకు" (*exousias*) విరోధముగా జరుగుచున్నదని (ఎఫెసీయులకు 6:12) ఆయన ఎఫెసీ పత్రికలో సెలవిచ్చాడు. క్రీస్తు, "ప్రధానులు" (*archai*) మరియు "అధికారముల"తో (*exousiai*) సహా, సమస్తమును సృజించాడనియు (కొలొస్సయులకు 1:16), క్రీస్తు సమస్త "ప్రధానులకును" (*arches*) "అధికారులకును" (*exousias*) శిరస్సై యున్నాడనియు (కొలొస్సయులకు 2:10), క్రీస్తు సిలువలో "ప్రధానులను [archas] అధికారులను [*exousias*] నిరాయుధులనుగా చేసాడనియు" (కొలొస్సయులకు 2:13–15) పౌలు కొలొస్సయులకు వ్రాసిన తన పత్రికలో రూఢిపర్చుచున్నాడు. ప్రజలు "అధిపతులకును [*archais*] అధికారులకును [*exousiais*] లోబడి విధేయులుగా ఉండవలెనని" తీతు వారికి గుర్తుచేయవలసినదని పౌలు తీతు 3:1లో, అతనితో చెప్పుచున్నాడు.

ఎఫెసీ పత్రికలోని వాక్యభాగములు "ప్రధానులు" మరియు "అధికారలు"తో కూడ "పరలోక స్థలములలో" అను పదములను ప్రయోగించుచున్నవి (1:3 చూడుము) గనుక, ఇవి ఆధ్యాత్మిక ప్రదేశాన్ని సూచిస్తున్నాయి. ఏది ఏమైనా, "పరలోక స్థలములలో" అను మాటలు తీతు పత్రికలో వ్రాయబడలేదు. అలాగైతే, దీనిలో గల అభిప్రాయమేమై యుంటుంది? తీతు 3:1 ప్రజలు నేలుచుండు ప్రభుత్వములను సూచించుచున్నదనియు,

గనుక క్రైస్తవులు పరిపాలనాధికారులకు విధేయతతో లోబడవలెననియు తేటతెల్లముగా తెలియుచున్నది. ప్రధానులను మరియు అధికారులను క్రీస్తు సృజించాడని కొలొస్సయులకు 1:16 చెప్పుచున్నది. సృష్టింపబడిన సకల సృష్టి "చాల మంచిదై యుండెను" అని ప్రకటింపబడింది (ఆదికాండము 1:31) గనుక, సృజింపబడినది మంచిదై యుండినదే కానీ చెడ్డదై యుండలేదు. మంచిదై యుండినదే చెడుగా మారిందని చెడు యొక్క మూలము గూర్చి ఉత్తమంగా చెప్పుకొనవచ్చును. నేడు ఉన్నట్టుగా సాతానునిగాని లేక చెడునుగాని మన మంచి దేవుడు సృజించలేదు. చెడు స్వభావము గూర్చి లోతుగా పరీక్షించక మునుపు, క్రీస్తు చేత సృజింపబడిన ప్రధానులు మరియు అధికారులు వారంతట వారే చెడ్డవారు కారు కానీ, మంచివారే అని మనము కనీసము అంగీకరించవచ్చును. కొలొస్సయులకు 2:13–15లో, యేసు క్రీస్తు ప్రధానులను మరియు అధికారులను నిరాయుధులనుగా చేసి సిలువచేత వారిపై విజయమొందాడని పౌలు సెలవిచ్చుచున్నాడు. కాబట్టి, ఈ శక్తులు చెడ్డవై యుండును. క్రీస్తు సమస్తమైన ఆధిపత్యముకంటెను అధికారముకంటెను ఎంతో హెచ్చుగా హెచ్చింపబడినవాడై యున్నాడని చెప్పబడుచున్నది, కాని ఈ అధికారములు మంచివో చెడ్డవో సూచింపబడుటలేదు (ఎఫెసీయులకు 1:20–21). క్రైస్తవులు ప్రధానులకును, అధికారులకును, ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాథులకును విరోధముగా పోరాడుచున్నారు (ఎఫెసీయులకు 6:12). ఈ ప్రధానులు మరియు అధికారులందరికిని – వారు ప్రజలనేలుచుండు ప్రభుత్వాలైనా, దుష్టశక్తులైనా, లేదా పరలోకములోని దేవదూతలైనా – ఈ లోకము గూర్చి దేవుడు కలిగియున్న ప్రణాళికను మరియు సంకల్పమును తెలియజెప్పవలసిన బాధ్యత సంఘముపై ఉన్నదని పౌలు ఎఫెసీయులకు 3:8–11లో ఉపదేశించుచున్న విషయమై యున్నది. అలాగైతే, సంఘము ఈ పని ఎలా చేయవలసి యున్నది? సువార్త బోధింపబడినప్పుడు, పరలోక భూలోకములు, మంచి చెడులు, స్వాభావికము మరియు ఆధ్యాత్మికమునైన ప్రపంచము, వాని దూతలతో కూడ సాతాను సహితము దేవుని జ్ఞానము ప్రబలముగా పనిచేయుచున్నదని పరిశీలనగా పరికిస్తారు. నశించుచున్నవారు కనుగొనబడుచు పాపులు రక్షింపబడుట ద్వారా ఈ పాపిష్ఠ లోకంలో దేవుని కార్యము మరియు జ్ఞానము విధితమగుచున్నవి.

## అన్వయము

### మర్మము వివరింపబడింది (3:1–13)

నెపోలియన్ బోనాపార్ట్ పేరు ప్రపంచమంతా ప్రఖ్యాతిగాంచి యున్నది, ఏలయనగా అతడు ఐరోపా ఖండాన్ని జయించనై యుండెను. అతడు కళాభిమానియు విజ్ఞాన శాస్త్రముల పోషకుడునై యుండెను, అట్లయినను ఈ విషయం అనేకులకు తెలియదు. జులై 1798లో, నెపోలియన్ ఐగుప్తు దేశాన్ని ఆక్రమించుకొనుటకు మొదలుపెట్టాడు, కానీ సెప్టెంబర్ 1801 నాటికి అతడు ఆ దేశాన్నే వదిలిపెట్టి వెళ్లునట్లు బలవంతము చేయబడ్డాడు. సైనిక మరియు రాజకీయ సంబంధమైన ప్రణాళికలకు సంబంధించినంత వరకు అతని ఈ మూడు సంవత్సరముల కృషి విఫలమైనట్టుగానే ఉండింది, కానీ అతనికి అత్యంత ఆసక్తికరముగా నుండిన ఒక విషయంలో – ప్రాచీన కాలపు శిథిలాలను కట్టడాలను అధ్యాయనం చేసే శాస్త్రంలో – అవి సఫలీకృతమైన సంవత్సరములై యుండినవి. ఆగస్టు

1799లో, నెపోలియన్ సైన్యాధికారలలో ఒకడు, Pierre - Francois Bouchard నైలు నది డెల్టా ప్రాంతంలో, ఈ రోజుల్లో సుప్రసిద్ధమైనదై యున్న Rosetta Stoneను కనుగొన్నాడు. ఈ రాయి, మూడు ప్రాచీన భాషల్లో శిలాశాసనం లిఖింపబడి యుండినరాయి, ఈజిప్టులో అతి పురాతనమైన రూప సంకేతాలతో కూడిన రాతల గూర్చిన మర్మమును విద్వాంసులు కనుగొని లోతుగా గ్రహించగలుగునట్లు వారికి ఒక కీలక మార్గమును సమకూర్చింది. ఈ ఒక్క రాయి ఆధునిక ఐగుప్తు సంబంధమైన అధ్యయనములకు ద్వారములు తెరచింది.

ఎఫెసీ పత్రిక వివరించుచున్న "మర్మము" (పవిత్ర రహస్యము) దేవుని Rosetta Stone అయియుంది. దేవుడు పాత నిబంధనలో వాగ్దానము చేసిన విషయాన్ని, యేసు క్రీస్తు సువార్తలలో చేసిన కార్యాలను, మరియు ప్రస్తుతము సంఘము చేయుచున్న పనులను గ్రహించుటకు అదే దాని తాళపుచెవియై యున్నది. జ్ఞాపకముంచుకోండి, బైబిలు సంబంధమైన మర్మము ఏదో అర్థంకాని అయోమయమైన ఒక అంశం కాదు. విశేషంగా, అది ఒకప్పుడు దేవునికి మాత్రమే తెలిసి యుండిన విషయమై యుండింది, కానీ ఇప్పుడు అందరు తెలిసికొనునట్లు అందరికిని బహిరంగముగా ప్రకటింపబడుచున్న ప్రాముఖ్యమైన సంగతై యున్నది. తేటతెల్లముగా తెలియజేయబడిన మర్మము చరిత్రకు ఒక అర్థాన్ని ఆపాదించుచున్నది.

ఎఫెసీయులకు 3:1–13, దేవుని మర్మము యొక్క నానా విధములైన కోణములను తెలియపరచుచున్నది గనుక వీటిని ప్రజలందరును తెలిసికొనవలెనని ఆయన ఆశిస్తున్నాడు.

*మర్మమును ఎవరు వివరించారు?* (3:1, 2, 7). "ఈ హేతువు చేత, అన్యజనులైన మీ నిమిత్తము క్రీస్తు యొక్క ఖైదీనైన పౌలను నేను ..." (3:1). దేవుడు తన మర్మమును ఒక వ్యక్తి ద్వారా బయలుపరచుటకు వానిని ఏర్పరచుకొన్నాడు. దేవుడు మానవులమైన మన ద్వారా తన కార్యములు చేస్తుంటాడు. ఏదైనా సంఘము ఎదుగుచున్నట్లయితే, తన సభ్యుల తలాంతులను అది సద్వినియోగము చేసుకొనుచున్న సకారణమునుబట్టియే అది ఎదుగుచుండును.

దేవుడు తన చిత్తమును నెరవేర్చుకొనుటకు ఏర్పరచుకొన్న అట్టి వ్యక్తులలో పౌలు ఒకడై యుండెను. ఈయన అంకిత భావముగలవాడు, ప్రార్థనాపరుడు, అలుపెరుగనివాడు, మరియు ఆత్మ చేత నడిపింపబడినవాడై యుండి, సంఘ మర్మమును ప్రపంచ నలుమూలల్లో ప్రకటించుటకు దేవుని చేత ఏర్పరచుకొనబడ్డాడు.

*"క్రీస్తు యేసు యొక్క ఖైదీనైన" అని పౌలు తనను పిలుచుకొనుచున్నాడు* (3:1). ఆయన రోమా పట్టణంలోని ఒక చెరసాలలో ఉండెననియు, నీరో చక్రవర్తి యెదుట తీర్చబడనై యుండిన తీర్పు కొరకు వేచియున్నాడనియు ఆయన రచించాడు. ఆయన చెరసాలలో నుండి తప్పించుకొని పోకుండునట్లు చూడాల్సిన బాధ్యత అప్పగింపబడిన ఒక రోమా సైనికునికి కట్టబడియుండిన బంధకములతో ఆయన దివారాత్రములు బంధింపబడి యుండెను. ఈ చెరసాలలో పౌలు దాదాపు మూడు సంవత్సరములు గడిపాడు. అయితే, "నీరో చక్రవర్తి యొక్క ఖైదీని" అని ఒక్కసారైనను ఆయన తనను తాను సంబోధించుకొనలేదు! ఆయన గ్రంథస్థం చేసిన పత్రికలన్నిటిలోను "క్రీస్తు యేసు యొక్క ఖైదీనైన నేను" అని తనను తాను సంబోధించుకొనుచున్నాడు.

పౌలు తాననుభవించిన సమస్త శ్రమలన్నీ కూడ, యేసే అనుభవించుచుండెనని

ఎంచాడు. గలతీయులకు వ్రాసిన పత్రికలోని చివరి వచనమునకు తరువాతి దానిలో, ఆయన అనుభవించిన కొరడా దెబ్బలు, రాళ్ల చేత కొట్టబడుట, మరియు కొట్టబడిన దెబ్బలు మొదలైన వాటిన్నింటిని మరొక పర్యాయం వెనుదిరిగి పౌలు గుర్తుచేసుకొనుచున్నాడు. "నేను బండలు, రాళ్లు, కొరడాలు, మరియు ఇనుప కడ్డీల ముద్రలు నా శరీరమందు ధరించి యున్నానని" ఆయన రచించలేదు. కానీ ప్రత్యేకంగా, "నేను యేసు యొక్క ముద్రలు నా శరీరమందు ధరించి యున్నానని" ఆయన లిఖించాడు (గలతీయులకు 6:17). అలాగైతే, ప్రస్తుత కాలములో మనము ఎదుర్కొనుచున్న పరిస్థితుల గూర్చిన మన దృక్పథములోని తేడా అంతా మనము పౌలు శ్రమలతో పోల్చుకొను దానిపై ఆధారపడి ఉంటుంది!

పౌలు తానెదుర్కొనుచుండిన పరిస్థితిని దృష్టించినప్పుడు, అది ఎంతటి క్లిష్టమైనదైనా లేక ఎంతగా శ్రమపెట్టుచుండినదైనా, అవన్నియు దేవుని మహిమార్థమై సంభవించుచుండినవని ఎంచాడు. దేవుని మర్మమును అన్యజనులకు ప్రకటించు నిమిత్తమే ఆయన క్రీస్తు యేసు యొక్క ఖైదీయై యుండెను.

"మీ కొరకు నాకనుగ్రహింపబడిన దేవుని కృప విషయమైన యేర్పాటును గూర్చి మీరు వినియున్నారు" (3:2) *తానొక గృహనిర్వాహకుడై యుండెనని పౌలు భావించాడు.* మరొకరికి చెందియుండిన ఆస్తిపాస్తులను సంభాళించవలసిన బాధ్యత ఆయనకు అప్పగింపబడింది. ఈ సందర్భములో, ఆశ్చర్యముతో ముంచెత్తు దేవుని మర్మము గూర్చిన గృహనిర్వాహకత్వ బాధ్యత ఆయనకు అప్పగింపబడినదని పౌలు ఘోషించాడు.

"దేవుడు కార్యకారియగు తన శక్తినిబట్టి నాకు అనుగ్రహించిన కృపావరము చొప్పున, నేను ఆ సువార్తకు పరిచారకుడనైతిని" (3:7). *దేవుని సందేశమును ఇతరులకు ప్రకటించువాని గుణశీలము ఒక దాసుని గుణశీలమై యుండవలెను.* తన సొంత పేరు ప్రఖ్యాతులనే లక్ష్యముగా కలిగియున్న ఏ బోధకుడైనను దేవుని చేత ఆశీర్వదింపబడుచున్న పరిచర్యను కలిగియుండనేరడు. ఇతరులందరు ఆయననే మాదిరిగా ఎంచుకొని ఆయననే వెంబడించాలని ఆశించు ఏ బోధకుడైనను, తన గురి తప్పిన గుడ్డివాడే ఔతాడు. అహంభావము మరియు గర్వము గొప్ప ప్రసంగమునకు శత్రువులై యున్నవి. అది బోధయైనా లేక పరిచర్యయైనా, అది సార్థకమైనదై యుండాలంటే, వాడు దేవుని దాసుడై యున్నాడని తనను తాను ఎంచుకొనువాని చేతనే అది చేయబడవలెను.

*మర్మము యొక్క సారాంశమేమై యుండింది?* (3:6, 8–11). "ఈ మర్మమేదనగా, అన్యజనులు సువార్తవలన క్రీస్తు యేసునందు యూదులతో పాటు సమానవారసులును, ఒక శరీరమందలి సాటి అవయవములును, వాగ్దానములో పాలివారునై యున్నారనునదియే" (3:6). దైవీకమైన మర్మములోని విషయ సూచికను పౌలు అంతకు మునుపు సూచించాడు, కానీ 6వ వచనంలో ఆయన దానిని యింకా విశదంగా విశదీకరించాడు: అన్యజనులు యూదులతోపాటు ఒక్క శరీరములో దేవుని చేత అంగీకరింపబడి యున్నారు. ఆయన తన బహిరంగ ప్రజా పరిచర్య చేయుచుండిన సందర్భములో యేసు ఈ గొప్ప మర్మమును సూచించాడు: "ఈ దొడ్డివికాని వేరే గొఱ్ఱెలును, నాకు కలవు; వాటిని కూడ నేను తోడుకొని రావలెను, అవి నా స్వరము వినును; అప్పుడు మంద ఒక్కటియు గొఱ్ఱెల కాపరి ఒక్కడును అగును" (యోహాను 10:16).

ఈ మర్మములో మూడు సత్యములు దాగియున్నవి: అన్యజనులు సహితము దేవుడు

యూదులకు అనుగ్రహించుచుండిన అదే స్వాస్థ్యమునకు సమాన వారసులు గావింపబడ్డారు, అన్యజనులు కూడ యూదులతోపాటు సమాన స్థాయిలో ఒక్క శరీరములోని సాటి సభ్యులై యుండిరి, అన్యజనులు దేవుని వాగ్దానములలో యూదులతోపాటు సంపూర్ణ పాలిభాగస్థులై యుండిరి. ఇలా జరుగుతుందని యూదులు ఏనాడైనను ఎరిగియుండలేదు. ఇటువంటి దీవెనలు అన్యజనులకు కూడ అనుగ్రహింపబడునని వారు కలలోనైనా ఊహించలేదు. అది పూర్వకాలము నుండి దేవుని రహస్యమై, ఒకప్పుడు దాచబడినదై యుండింది కానీ ఇప్పుడు తేటపరచబడింది.

ఇదెలా సాధ్యం? అన్యజనులు యూదులతోపాటు సమానవారసులు, సాటి సభ్యులు, మరియు పాలిభాగస్థులు ఎలా కాగలరు? ఇదంతా "సువార్త వలననే" సాధ్యమగునని పౌలు ఘోషించాడు. సువార్త దేవుని శుభవర్తమానమై యున్నది, అదేమనగా యేసు క్రీస్తు సమస్త ప్రజల కొరకు మరణించాడు, మరియు తన శక్తి చేత తిరిగి లేపబడినాడు. విభాగించుచుండిన ద్వేషమను అడ్డుగోడను దేవుడు సిలువలో పడగొట్టి, ఆయనలోనే ఒక నూతన పురుషుని, అనగా యూదుడని అన్యజనులని, దాసుడని స్వతంత్రుడని, పురుషుడని స్త్రీయని ఏ భేదమును లేని వానిని, సృష్టించుకొన్నాడనునది బయలుపరచబడిన దేవుని మర్మమై యున్నది. దేవుని మనస్సులో అనాదిగా ఉండిన ప్రణాళిక ఇదియే. కాబట్టి సంఘము ఏదో ప్రమాదవశాత్తు ఏర్పడింది కాదు; అది దేవుడు చివరి క్షణాల్లో ఆలోచించిన అభిప్రాయం కాదు. మన విమోచన గూర్చి ఆయన జగత్తు పునాది వేయబడక మునుపే ప్రణాళిక వేయుటలో, జాతి భేదాలకు సంబంధించిన స్వాస్థ్యముతో నిమిత్తము లేకుండా ప్రజలందరు కలిసియుండిన ఒక్క శరీరము, దేవుని నిత్య మర్మము యొక్క సారాంశమై యుండింది.

"శోధింపశక్యముకాని క్రీస్తు ఐశ్వర్యమును అన్యజనులలో ప్రకటించుటకు, పరిశుద్ధులందరిలో అత్యల్పుడనైన నాకు, ఈ కృప అనుగ్రహించెనని" చెప్పుచూ, పౌలు ఈ నూతన సంబంధము గూర్చి విస్తృతంగా వివరించాడు (3:8). ఈ "ఐశ్వర్యము" ఏమై యున్నది? పౌలు రచనల సహాయంతో, దేవుడు దయ, సహనము, తాళిమి. మహిమ, జ్ఞానము, తెలివి, కనికరము, కృప, మరియు క్షమాపణ మొదలుగు విషయాలన్నింటిలోను మహదైశ్వర్యవంతుడై యున్నాడని మనము తెలుసుకొనుచున్నాము.

మనము క్రీస్తు నందు పొందిన ఆశీర్వాదములు ఇవే. ఆయనలో దేవుడు మనలను ఆధ్యాత్మికంగా ఐశ్వర్యవంతులైన కోటేశ్వరులనుగా చేసాడు! మనము యూదులమైనా, అన్యజనులమైనా, మనకు అపారమైన ఐశ్వర్యమున్నది.

*దేవుడు తన మర్మమును తేటపరచుటలో ఆయన తాత్పర్యమేమై యుండింది?* (3:8-11). దేవుడు తన పవిత్ర రహస్యమును తేటపరచిన దాని ఫలితంగా, క్రీస్తు శరీరము యొక్క మర్మము, ఈ క్రింది సంగతి సంభవించాలని దేవుడు ఉద్దేశించాడు:

> ... బహువిధమైన దేవుని జ్ఞానము సంఘము ద్వారా పరలోక స్థలమలందలి ప్రధానులకును అధికారులకును తేటపరచబడవలెను. ఇది మన ప్రభువైన క్రీస్తు యేసునందు ఆయన చేసిన నిత్య సంకల్పము ప్రకారమైనదై యుండింది (3:8-11).

దేవుడు సంఘమును ఎందుకు కల్పించాడు, ఎందుకు పిలిచాడు? తన జ్ఞానము యొక్క

గొప్పతనమును "పరలోక స్థలములందలి ప్రధానులకును అధికారులకును" చూపించుటకే.

ఈ ప్రధానులకును అధికారులకును మనము ఉపదేశించాల్సిందేమిటి? దేవుని బహువిధ జ్ఞానమును వారికి మనము బోధిస్తాము. దేవుడు పాపిష్ఠియైన, తిరుగుబాటుతనముగల, మొండి మానవాళిని తీసుకొని తన పరిశుద్ధత యొక్క సజ్జనత్వము విషయంలో ఎవ్విధంగాను రాజీ పడకుండానే ఎలా మనలను సంపూర్తిగా క్షమిస్తాడో మన జీవితముల ద్వారా వారికి చూపిస్తాము. దేవుని ప్రేమిస్తూ, పాపమును ద్వేషిస్తూ, వెవ్వేరు నేపథ్యములతో నిమిత్తము లేకుండా ఒకరి నొకరు అంగీకరించు ఒక సహవాసముగా ఆయన మనలను ఎలా మార్చివేస్తాడో మనము ప్రదర్శిస్తాము.

ఈ ప్రధానులు మరియు అధికారులు దేవుని కృపాకనికరములను సంఘము ద్వారా మాత్రమే చవిచూడగలరు. దేవుని ప్రేమ ఎంత అపారమైనదై యున్నదో, సంఘము ద్వారా మాత్రమే వారు తెలిసికొనగలరు. దేవుని క్షమాపణ సామర్థ్య విస్తరణ ఎంత సువిశాలమయ్యిందో, సంఘము ద్వారా మాత్రమే వారు కనుగొనగలరు.

మనము దేవునితోను ఒకరితోనొకరమును కలిగియున్న మన సంబంధముల ద్వారా చేసేదంతా దేవుని జ్ఞానమును ప్రతిబింబిస్తుంది. చివరకు, ఆధ్యాత్మికముగా నలిగిపోతున్న లోకమును విమోచించుటలో విధితమగుచున్న ఆయన జ్ఞానము యొక్క మహదైశ్వర్యమును ప్రదర్శించుట, మనము దేవుని ప్రజలముగా జీవించుటలో గల ఉద్దేశమై యున్నది.

*ఈ మర్మము ద్వారా మనకు ప్రాప్తించు ఆశీర్వాదమేమిటి?* (3:12). "ఆయనయందలి విశ్వాసముచేత ధైర్యమును నిర్భయమైన ప్రవేశమును ఆయననుబట్టి మనకు కలిగియున్నవి" (3:12). దేవుడు క్రీస్తు యేసు ద్వారా ఒక్క శరీరమును చేయుటనుబట్టి, మనము దేవుని సమీపించగల ఆశీర్వాదమును మనము ఆనందంగా అనుభవిస్తున్నాము. మనము ఆయనను స్వేచ్ఛగాను ఆత్మవిశ్వాసంతోను సమీపింపవచ్చును, ఏలయనగా మనకును దేవునికిని మధ్య ఉండిన అడ్డంకులన్నియు కలువరి గిరిపై కూలగొట్టబడినవి.

దేవుడు మనలను ప్రేమించుచున్నాడు గనుక ఆయనకు మనతో గల సహవాసము నందు సంతోషిస్తూ మన స్తుతిసంకీర్తనములను ఆస్వాదించాలనియు, మన మనవులను ఆలకించాలనియు ఆయన ఆశిస్తున్నాడు. ఒకడు ఈ విశాల విశ్వమంతటి సృష్టికర్త చేత సంపూర్ణముగా అంగీకరింపబడుననియు, వాడు ఆయనతో ఎల్లవేళలందు సంభాషించవచ్చుననియు తెలుసుకొనుటను మించిన మరొక భాగ్యమేదైన ఉంటుందా?

*ముగింపు.* ఆయన రక్షణ సందేశము సర్వలోకములోని సర్వ సృష్టికి తేటతెల్లముగా తెలియజెప్పబడవలెనని దేవుడు ఎంతగానో ఆశిస్తున్నాడు. ఈ ప్రక్రియలో, స్త్రీపురుషులు మార్పునొందుదురు మరియు దేవుడు ఇప్పుడు మరియు నిరంతము మహిమపరచబడును.

## క్రీస్తుపై మన దృష్టిని కేంద్రీకరించుట

Arturo To Scanini (1867–1957), ప్రపంచమంతటిలో సుప్రసిద్ధులైన వాద్యసమ్మేళన నిర్వాహకులలో ఒకడై యుండెను. ఒకసారి, Ludwig Van Beethoven చేత ఒక స్వరసమ్మేళనము వాయించబడునట్లు ఆయన ఒక వాద్య బృందమును సిద్ధం చేయుచుండిన సమయంలో, "నేను నిమిత్తమాత్రుడనే; నీవునిమిత్తమాత్రుడవే; Beethoven అంతా" అని Toscanini అన్నాడు. అనగా, అందరి దృష్టిని ఆయనవైపే ఆకర్షించాలనునది

అతని పని కాదనియు, అందరు Beethoven యొక్క మేధావి చేత ముగ్దులగునట్లు ప్రయాసపడుటయే అతని కర్తవ్యమనియు ఆయన అర్థం చేసుకొన్నాడు.

అందరి దృష్టిని మనమే ఆకర్షించాలని మనము దేవుని కృపను ప్రచురము చేయము, చేయకూడదు, కానీ మన దృష్టి అంతా క్రీస్తు యేసు సందేశముపైనే కేంద్రీకృతమై యుండునట్లు చూచుకొనుట మన కర్తవ్యమని పౌలు గ్రహించాడు, ఈ నిత్యసత్యమును మనము కూడా గ్రహించాల్సి వున్నది. మనము నిమిత్తమాత్రులమే; అంతా క్రీస్తే. "కాబట్టి వృద్ధి కలుగజేయు దేవునిలోనేగాని, నాటువానిలోనైనను నీళ్లుపోయువానిలోనైనను ఏమియులేదని" పౌలు కొరింథీయులకు గుర్తుచేసాడు (1 కొరింథీయులకు 3:7). మనము ప్రసంగ వేదికపై నుండి బోధ చేయుచుండినా లేక పొరుగువారితో వ్యక్తిగతంగా మాట లాడుచుండినా, మన ధ్యాస మరియు దృష్టి అంతా క్రీస్తుపైనే కేంద్రీకృతమై యుండవలెను.

**నిజమును నిక్కచ్చియునైన భక్తి**

మనము "... అని అనుకొంటున్నాను" అను మార్గమును ప్రచురించము. మనము శోధింపశక్యముకాని. అపారమునైన దేవుని ఐశ్వర్యమును దివాలా తీసిన మానవాళికి ప్రకటిస్తాము. దేవుని గూర్చి చెప్పుచూ ఆయన, "మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగువాటన్నిటింకంటెను, ఊహించువాటన్నిటికంటెను అత్యధికముగా చెయ శక్తిగల దేవుడని" పౌలు 3:20లో సెలవిచ్చుచున్నాడు.

క్రిస్ బుల్లార్డ్

---

సూచనలు

[1]Andrew T. Lincoln, Ephesians, Word Biblical Commentary, vol. 42 (Dallas: Word Books, 1990), 184. [2]Kenneth S. Wuest, *Wuest's Word Studies from the Greek New Testament for the English Reader: Ephesians and Colossians* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1953), 84. [3]Lincoln, 184. [4]S. D. F. Salmond, "The Epistle to the Ephesians," in The Expositor's Greek Testament, ed. W. Robertson Nicoll (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1967), 3:309. [5]ఈ విషయము క్రీస్తు రాజ్యము యింకా స్థాపింపబడలేదు గనుక క్రీస్తు రెండవసారి వచ్చినప్పుడు అది స్థాపింపబడునని చెప్పుచున్న, వెయ్యేండ్ల పరిపాలనకు ముందటి కాలమునకు సంబంధించిన ఒక మౌలిక సిద్ధాంతముగా అనేక క్రైస్తవ మతశాఖల దృక్పథమై యున్నది. ఇట్టి అభిప్రాయము మార్కు 9:1 మరియు కొలొస్సయులకు 1:13, 14 మొ॥ వాక్యభాగములను కాదనుచున్నది. (Foy E. Wallace, Jr., *God's Prophetic Word*, rev. ed. [Oklahoma City: Foy E. Wallace, Jr., Publications, 1960], 161.) [6]Ethelbert W. Bullinger, *A Critical Lexicon and Concordance to the English and Greek New Testament* (London: Samuel Bagster and Sons, n.d.; reprint, Grand Rapids, Mich.: Zondervan Publishing House, Regency Reference Library, 1975), 433, 153. [7]Lincoln, 189. ఒక్క–ఉపపదము అను భావన, సాల్మండ్‌తో సహా (310), కొందరు వ్యాఖ్యానకర్తల చేత వ్యతిరేకింపబడుచున్నది, కానీ గ్రీకు మూలాధార గ్రంథ పాఠములో రూపొందింపబడిన పదజాలముతో దీనికి మద్దత్తు లభించుచున్నది. [8]Lincoln, 190. [9]Bullinger, 107.